క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అమరేందర్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన గోవర్దన్ అనే వ్యక్తి గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలను ఆర్థిక సాయంగా అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వజ్రం, రవికుమార్‌రెడ్డి, రఘుమారెడ్డి, మల్లారెడ్డి, అశోక్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన ఎంఈఓ



ఎస్సీ హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలునాయక్

మిర్యాలగూడ టౌన్ : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మౌలిక ఆదేశాల మేరకు గురువారం రాత్రి మండల విద్యాశాఖాధికారి బాలునాయక్ ఖమ్మం రోడ్డులోని ఎస్సీ, ఎస్టీ బాలికల హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నూతనంగా అమలు చేసిన మెనూతో పాటు అన్ని రకాల రికార్డులు, విద్యార్థుల గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెట్టిన భోజనం కూడా చూశారు. ఈ సందర్భంగా స్టడీ రూమ్‌లో ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలను చేపట్టారు. ఆయా హాస్టళ్లలో మెనూను అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎస్సీ బాలికల హాస్టల్‌లో మంచినీటి వసతి, నైట్ వాచ్‌మన్, కుక్ కావాలని కోరగా ఈ విషయంను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఆయా హాస్టళ్ల వార్డెన్లు సావిత్రి, సంధ్యారాణి తదితరులున్నారు.

హౌస్ లిస్టింగ్ ప్రక్రియ సులభతరం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : సమగ్ర కుటుంబ సర్వేలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ఉపాధ్యాయులకు సులభతరం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో ముందుగా ఉపాధ్యాయులను కాకుండా ఇతరులను ఎన్యూమరేటర్లుగా తీసుకున్నారని, ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సహకరించాలని కోరినట్లు తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో ఎదురవుతున్న సవాళ్లను అధికమించేందుకు చర్యలను తీసుకోవాలని కోరారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

డిండి : ఈ నెల 11న మిర్యాలగూడలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండలంలోని కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు బూషిపాక లింగమయ్య, దేవయ్య, జవహర్, బాల్‌రాజు, అంజి, భాగ్యమ్మ, లక్ష్మమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వేములపల్లి(మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని చిరుమర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మహమ్మద్ సలీం తండ్రి మహమ్మద్ జానిమియా కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు గ్రామానికి చేరుకొని జానిమియా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

పెద్దవూర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ, రామచంద్రయ్య ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలెక్కడ!

- విస్తృతంగా వినియోగం
- సక్రమంగా తనిఖీలు చేపట్టని అధికారులు
- జూట్ బ్యాగుల వినియోగంపై అవగాహన తప్పనిసరి

దేవరకొండ : ప్లాస్టిక్ భూతం నానాటికీ విస్తరిస్తోంది.. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుండటంతో పర్యావరణం దెబ్బతింటోంది. భూగర్భ జలాలు సైతం అడుగంటి పోయే ప్రమాదం లేకపోలేదు అంటున్నారు పర్యావరణ వేత్తలు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఇన్ని అనర్థాలు జరుగుతున్నా వీటి వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదని పలువురి విమర్శ. సంబంధిత అధికారులు తనిఖీల సమయంలో జరిమానాలు విధించినప్పటికీ వినియోగం మాత్రం తగ్గడం లేదని ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి.

యథేచ్ఛగా ...

అధికారులు తనిఖీల సమయంలో ముందుగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అంతేగాకుండా మళ్లీ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే వారికి జరిమానాలు సైతం విధిస్తున్నారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ గతంలో ర్యాలీలు నిర్వహించారు. అయితే అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండటంతో పలువురు ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు బాహాటంగానే విన్పిస్తున్నాయి. పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అధికారులు పలుమార్లు దుకాణదారులు, వినియోగదారులకు అవగాహన కల్పించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది. ఇప్పటికే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో గల ఆయా కాలనీలు, మురుగు కాల్వల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, పర్యావరణ ఇంజనీర్ సక్రునాయక్‌లు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నారు.



ఓపెన్ ప్లాట్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఇప్పటికే దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాం. అంతేగాకుండా వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించాం. పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు సైతం విధించాం. ముమ్మందు విస్తృత తనిఖీలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు అధికారులకు సహకరించాలి.

– వై.సుదర్శన్, కమిషనర్, దేవరకొండ

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులు,ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇందుకు గాను స్వీయ నిర్ణయం కూడా ముఖ్యమే. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు జూట్ బ్యాగులను వినియోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



కొండమల్లేపల్లి : పెండ్లిపాకల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే, తదితరులు



చందంపేట : కృష్ణా వెనుక జలాల్లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెండ్లిపాకల చెరువులో చేప పిలను వదిలిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చేపపిల్లల పెంపకం కార్యక్రమం దోహదపడుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, నాయకులు రేఖశ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్, వేమన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, యుగేందర్ రెడ్డి, హరికృష్ణ, పాపానాయక్, లక్ష్మి, శ్రీనివాస్, హన్మనాయక్, హేమ్లానాయక్, మత్స్యశాఖ జిల్లా అధికారి చరిత, అభివృద్ధి అధికారి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీ సమీపంలోని కృష్ణా వెనుక జలాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 13లక్షల చేప పిల్లలను గురువారం ఎమ్మెల్యే బాలునాయక్ వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మత్స్యకారులకు భవిష్యత్‌లో వాహనాలు అందిస్తామన్నారు. మూడు నెలల వరకు సన్న వలలు వేసి చేప పిల్లలను పట్టవద్దని కోరారు. మూడు నెలల వ్యవధిలో సన్న వలలతో చేపలను పడితే మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేసులు పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి సుచరిత, మారయ్య, అభివృద్ధి అధికారి మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, బిక్కునాయక్, వెంకటయ్య, మాధవరెడ్డి, యుగేందర్‌రెడ్డి, పాపానాయక్,త గ్రామస్తులు బంగారి, నాయకులు గడ్డం వెంకటయ్య ఉన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న మోదీ ప్రభుత్వం



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రజలపై భారాలు మోపుతున్న మోదీ పాలనకు ప్రజలు చైతన్యవంతులై బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన పట్టణ 13వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్తూ మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఆర్ఎస్ఎస్, అదాని, అంబాని సర్కార్ నడస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసం పనిచేస్తుందని, ప్రపంచ ప్రజలందరూ కమ్యూనిస్టు పాలనకు మద్దతు తెలుపుతున్నారన్నారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలను అణిచేసే దమ్ము, ధైర్యం కేవలం కమ్యూనిస్టు పార్టీకే ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించిందన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు హామీలను అమలు చేయడం లేదన్నారు. అమలవుతున్న సంక్షేమ పథకాల్లో లోపాలను అరికట్టాలన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ నాటకాలు ఆడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, పాండు, అరుణ, మంగారెడ్డి, అయూబ్, అంజాద్, రామ్మూర్తి, పరుశురాములు, వరలక్ష్మి, సీతారాములు, పద్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా సామాజిక, ఆర్థిక, కుల సర్వే



మిర్యాలగూడలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



మిర్యాలగూడ టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సర్వే స్టిక్కర్ వేస్తున్న సిబ్బంది



హాలియా : సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి

మిర్యాలగూడ: సమగ్ర కుటుంబ సర్వే, కుల గణనను పకడ్బందీగా చేపడుతున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల 5వ వార్డు, మిర్యాలగూడ మండలం గూడూరులో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే, కుల గణన తీరును ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, తహసీల్దార్ హరిబాబు, కౌన్సిలర్ నర్సిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ ఉన్నారు.

రైతులు మద్దతు ధర, బోనస్ పొందాలి

రైతులు తాము పండించిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరతోపాటు ప్రభుత్వం అందించే బోనస్ రూ.500 పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామ సమీపంలోని వైష్ణవి రైస్ మిల్లును తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 82 సన్నరకం, 258 దొడ్డురకం కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు సుమారు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, అందుకుగాను రూ.7 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, అధికారులు, మిల్లర్లు ఉన్నారు.

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి కోరారు. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్ రెడ్డి, కమిషనర్ రామదుర్గారెడ్డి ఆదేశాల మేరకు గురువారం మున్సిపాలిటీలోని 12వ వార్డులో నిర్వహిస్తున్న కులగణన సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎండీ అబ్దుల్ రషీద్, మున్సిపల్ అధికారులు ఉమర్, అక్బర్, కొండల్ తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీతో పాటు మిర్యాలగూడ మండలంలో గురువారం కులగణన సర్వే కొనసాగింది. ఈ బుధ, గురు వారాల్లో పట్టణంలోని 48 వార్డులు కాగా మండలంలోని 46 గ్రామ పంచాయతీల్లో ఈ రెండు రోజుల్లో 35 వేల 382 గృహాలకు స్టిక్కర్లు వేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే చివరి రోజున పూర్తి స్థాయిలో స్టిక్కర్లు అతికించడంతో అసలు గృహాలు ఎన్ని ఉన్నాయనే విషయం తెలిసే అవకాశం ఉంది.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి సర్వే స్టిక్కర్ ఇవ్వడంతో పాటు ఆయన క్యాంపు ఇళ్లు గుర్తింపునకు స్టిక్కర్‌ను ఎన్యూరేటర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఆర్ఓ జ్ఞానేశ్వరీ, సూపర్‌వైజర్లు ప్రవీణ్‌కుమార్, జానిమియాలతో పాటు పలువురు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్థిక సామాజిక కులగణన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని పాత ఊరులో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో జరుగుతున్న కుటుంబ సర్వేను తనిఖీ చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, కార్యదర్శి ధరణి, ఉన్నారు.

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల వ్యాప్తంగా గ్రామాల్లో కుల గణన సర్వే కొనసాగుతుంది. గురువారం త్రిపురారం మండలంలోని బాబుసాయిపేట, పెద్దదేవులపల్లి గ్రామాల్లో తహసీల్దార్ గాజుల ప్రమీల పరిశీలించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎంఈఓ రవి నాయక్, సర్వే సిబ్బంది తధితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

దేవరకొండ : రోగులకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మెరుగైన సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ మాతృనాయక్ అన్నారు.గురువారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా వార్డులను సందర్శించిన ఆయన రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మధ్యాహ్నం అందిస్తున్న భోజనం, వసతులపై రోగులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దేవరకొండ ఆస్పత్రికి ఆర్వో వాటర్ మంజూరైనట్లు తెలిపారు. రూ.రెండున్నర లక్షలతో ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌ను త్వరలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు.ఆయన వెంట వైద్యులు మంగ్తానాయక్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న మాతృనాయక్

వాడపల్లిలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వాడపల్లి వద్ద మూసీ, కృష్ణా మూసీ సంగమం వద్ద కొలువైన శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌కు ఆలయ కమిటీ చైర్మన్ కొందూటి సిద్దయ్య, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం విశిష్టతను కలెక్టర్‌కు వివరించారు. కృష్ణా, మూసీ సంగమం పరివాహక ప్రాంతాలను కలియదిరిగారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, తహసీల్దార్ జవహర్‌లాల్ తదితరులు ఉన్నారు.

మాజీ సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం

మిర్యాలగూడ టౌన్ : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు మద్దతు ధర కల్పించే విధంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు కృషి చేశారంటూ గురువారం పట్టణంలోని వాసవి రైస్ ఇండస్ట్రీస్ వద్ద బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసివారి ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హతిరాంనాయక్, వీరానాయక్, ఎండీ షోయబ్, రవినాయక్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 500 బోనస్‌తో కలిసి రైతులకు మద్దతు ధరను కల్పిస్తామని ప్రభుత్వం నేటి వరకు కూడా ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకుండా రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఏ మిల్లులులోనైనా మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడి రైతులకు మద్దతు ధర ఇచ్చేంత వరకు నిద్రపోలేదన్నారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా, భాస్కర్‌రావు ఎమ్మెల్యే అయితేనే ఈ నియోజకవర్గ రైతులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగునాయక్, రమేష్‌నాయక్, శివనాయక్, ప్రకాశ్ నాయక్, శ్రీనునాయక్, బాలశంకర్‌నాయక్, ఫయాజ్, శోభన్‌నాయక్, మాతృనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రశ్న పత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో 95 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిని వరలక్ష్మిలతో జేవీవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట పేపర్‌ను గురువారం కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమావత్ నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి : టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సకాలంలో టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

పెద్దవూర : పశువులు, జీవాల యజమానులు గాలికుంటు వ్యాధిపై నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యశాఖ అధికారులు చెప్పిన సమయంలో తప్పనిసరిగా నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి నులక నాగార్జున్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సంగారం గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, మేలు జాతి దూడల ప్రదర్శనను నిర్వహించి మాట్లాడారు. గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కావడం వలన దీనిని నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఎదలో ఉన్న పశువులకు గర్భదారణ, చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ టీకాలు వేశారు. గ్రామంలో 80మేలు జాతి దూడలను ప్రదర్శించారు. విటమిన్ ఇంజక్షన్లు వేసి, పాల దిగుబడిని పెంచే ఖనిజ మిశ్రమాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నడ్డి బాలరాజుయాదవ్, గోపాలమిత్రలు గాలి లింగారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

టీజేఎస్ జిల్లా ప్లీనరీ కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండలోని ప్రకాశం బజారులో టీఎన్‌జీవోస్ భవనంలో శనివారం నిర్వహించే తెలంగాణ జనసమితి ప్లీనరీ సమావేశ కరపత్రాన్ని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వర్ రావు, జిల్లా కార్యదర్శి లావూరి క్రాంతికుమార్‌లు స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్లీనరీలో 'పౌర సమాజంతో ముచ్చట్లు' అనే అంశంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై ప్లీనరీని విజయవంతం చేయాలన్నారు. టీజేఎస్ నాయకులు సైదానాయక్, ప్రకాశ్ నాయుడు, రవీందర్‌నాయక్, పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సరికావు

మిర్యాలగూడ టౌన్ : బీసీ గర్జనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన మల్లన్న కాంగ్రెస్ నేతలపై అలాంటి వ్యాఖ్యలు చేయడం మంచి పద్దతి కాదన్నారు. అందరు ఓట్లు వేస్తేనే ఎమ్మెల్సీగా గెలిచిందనేది మరిచిపోవద్దన్నారు. ఈ సమావేశంలో పట్టణ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు చాంద్‌పాషా, నాయకులు లింగయ్య యాదవ్, కిరణ్, మల్సూర్, కృష్ణ పాల్గొన్నారు.

వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి



మిర్యాలగూడ అర్బన్ : మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్ అనారు. గురువారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సంఘం సీనియర్ నేత పాపానాయక్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బానోతు నాగేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శిగా లావూడి ఎర్రనాయక్, గౌరవ అధ్యక్షులు పాపానాయక్, ఉపాధ్యక్షులుగా రవినాయక్, ధీరావత్ శ్రీనునాయక్, రమావత్ హనుమంతునాయక్, సహాయ కార్యదర్శులుగా మాలోతు వినోద్‌నాయక్, దేశ్‌రాంనాయక్, జటావత్ రవినాయక్‌లతో పాటు మరో 19మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రానాయక్, నాగేశ్వర్‌రావు, రవినాయక్, శ్రీనునాయక్, పాండునాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

కరపత్ర ఆవిష్కరణ

హాలియా : ఈనెల 10న హైదరాబాద్‌లోని సోమాజిగూడలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని టీఆర్‌జీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొర్ర శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం హాలియా పట్టణంలో ఆ సంఘం నాయకులతో కలిసి సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కులాలను అణగదొక్కడమేనన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ రాష్ట్ర నాయకులు రమావత్ నరేష్ నాయక్, మాజీ సర్పంచ్ కొర్ర రవి నాయక్, నాయకులు లాలు నాయక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టొద్దు



వెంకటంపేట వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చింతపల్లి: పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ నిర్వాహకులు తేమ పేరుతో ఇబ్బందులు పెట్టొందని రైతులు డిమాండ్ చేశారు. తేమ శాతం ఎక్కువగా ఉందని సాకు చూపుతూ కొర్రీలు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండలం వెంకటంపేట వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చింతపల్లి, గడియగౌరారం, కొక్కిరాలతండా, వెంకటంపేట గ్రామాల్లో మూడు రోజుల క్రితం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసినా పత్తి కొనుగోళ్లు చేయకపోవడంతో ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. సీసీఐ అధికారులు తేమ శాతం పేరుతో ట్రాక్టర్లను తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు చెప్పడంతో ధర్నాకు దిగామన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి ఇన్ని కొర్రీలు పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కేంద్రాల నిర్వాహకుల తీరువల్ల దళారులకు పత్తి విక్రయించాల్సి వస్తోందన్నారు. ఇంటి వద్ద తేమ శాతాన్ని ఎలా చూడగలుగుతామని ప్రశ్నించారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకొస్తే తిరస్కరించడం సమంజసం కాదన్నారు. తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర కాకుండా తక్కువ ధరకైనా కొనుగోలు చేయాలని వేడుకుంటున్నా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు ఆందోళన చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీఐ కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.